# కథ-న కుతూహలమ్!

ఈడు కొంచెం మించిందన్నమాటే గాని, నారాయణకి చదువు బాగానే అంటింది. పదో క్లాసులో జిల్లాలో చదివిన అందర్లోకీ ఫస్టు వాడే. దాంతో ఇంటర్మీడియెట్‌లో సీటు రావడమే కాకుండా మా పక్క వూరి ప్రయివేట్ కాలేజీలో హరిజనులకి ఇస్తున్న ఫుల్ స్కాలర్‌షిప్ ఒకటి; రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వవలసిన దొకటి వొచ్చాయి వాడికి. అంతేకాకుండా సాంఘిక సంక్షేమశాఖవారు నిర్వహిస్తున్న హాస్టల్లో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కూడా వాడికి అడిగీ అడగ్గానే లభ్యమయాయి.

''తమరు కనికరించి సినబాబుగారు ఇడిసి పెట్టేసినయి నాలుగు జతల గుడ్డలు ఆడికిప్పిస్తే ఓ సంచ్చరం గడుపుకుంటాడండి'' అని మనవి చేసుకున్నాడు, మా పాలేరు వెంకడు.

మా చిన్నబ్బాయి కూడా వాడితోబాటే చదువుతున్నాడు. వీడు విడిచిపెట్టిన గుడ్డలు వాడు తొడుక్కుంటే బాగుండదని నాకనిపించింది. రెండువందల రూపాయలుతీసి ఇచ్చి 'కొత్తవి కుట్టించు' అన్నాను. గుమస్తాగారి ద్వారా యివ్వలేదు కనక ఆ సొమ్ము తిరిగి ఇవ్వనక్కర్లేదని వెంకడికి తెలుసు. వెంకడు నేను నిలుచున్న నేలని కళ్ళకద్దుకుంటూ వెళ్ళాడు.

ఇదంతా ఆరేళ్ళ కిందటి మాట.

ఆ తరువాత నారాయణ, వెంకణ్ణిగాని నన్నుగాని సర్వసాధారణంగా దేనికీ ఒక రూపాయి అడక్కుండా ఇంటర్మీడియేట్‌లో, వాళ్ళ కాలేజీకి ఆ సబ్జక్టులో ఫస్టురాంక్‌లో ప్యాసయ్యాడు. మెడికల్ ఎంట్రన్సులోకూడా గట్టెక్కాడు. మెడికల్ కాలేజిలో చేరినప్పుడు మాత్రం వెంకడి ద్వారా నారాయణమీద అయిదువందలు ధన రూపేణానూ వెయ్యి రూపాయలు మిగతా సదుపాయాల నిమిత్తమున్నూ ఖర్చుపెట్టాను నేను. అదికూడా తిరిగి ఇవ్వక్కర్లేదని స్పష్టంగా చెప్పాను.

మావాడికీ వచ్చింది మెడికల్ కాలేజీలో సీటు. వాడో నాలుగు వేలకి పెట్టాడు ఎసరు. మెడిసిన్ రెండో ఏడాది చదువుతూ వుండగా ఓసారి పట్నం వెడితే— మావాడు రూమ్‌లో లేడు. కాలేజీలో ఏదో ఫంక్షన్ వుందిట; అక్కడి కెళ్ళేడన్నారు. హాస్టల్‌కి పెద్ద దూరంకాదు, వెళ్ళాను.

అక్కడ స్టేజీమీద నారాయణ ఉపన్యాసం చేస్తున్నాడు. ఆ ఏడాది స్టూడెంట్స్ యూనియన్ కార్యకలాపాలలో మంచీ చెడ్డా సమీక రిస్తూనూ. కాసేపటిదాకా, మా వాడెక్కడున్నాడా అని చూడాలనిపించ లేదు నారాయణ వాగ్ధాటి. పరిశుభ్రమైన అవతారం, ప్రవర్తనా చూసి, నిజమైన ఆనందం అంటూ జీవితంలో అతి తక్కువసార్లు నాకు తటస్థించింది. అందులో ఒక సందర్భం యిది!........ నారాయణ, స్టూడెంట్స్ యూనియన్ సెక్రటరీట! మావాడూ నారాయణా ఊళ్ళో కొస్తే కలవరు, మాట్లాడుకోరు. అది శత్రుత్వంకాదు, కుల వైషమ్యం కూడా కాదు, మేం యజమానులం. తరతరాల్నించి వాళ్ళ మా నౌకర్లు. ఆ సంబంధానికి మించిన చనువు చూపిస్తే,కనబడితే- జనం ఊరుకోరు. పైగా మావాడు టౌన్‌లో ఎలా వుంటాడో నాకు కనబడదు గాని, సెలవులకో, స్ట్రయికులప్పుడో ఇంటికొస్తే పుస్తకాలు వదలడు!

రెండో యాడాది చివరి పరీక్షలయ్యాక గ్రామానికి వచ్చి నప్పుడు, నారాయణ తిన్నగా తమ పేటకు వెళ్ళిపోకుండా మా యింటి కొచ్చేసేడు. నేనప్పుడు ఇంటి దగ్గరే వున్నాను.

మా వాడు బండి ఎక్కి వచ్చాడు. బండి కింద తొట్టిలో నారాయణ తన సామానుపెట్టి, తను బండి వెనకాల నడిచి వచ్చాడు.

తన సామానులోంచి నాలుగైదు ట్రాఫీలు, అయిదారు మెమెం టోలు, కొన్ని ప్రయిజు పుస్తకాలు తీసి వాటిని అరుగుమీద పేర్చి నాకు వినయంగా నమస్కారం చేశాడు.

"అది డిబేటింగ్ ఫస్ట్ ప్రయిజ్‌ది. ఇది ఇలక్యూషన్ సెకండ్ ప్రయిజు. ఆ ట్రాఫీవాడు డైరెక్ట్ చేసిన నాటకానికి బెస్ట్ ప్రొడక్షన్ కిచ్చింది. ఈ ట్రాఫీ ఫుట్‌బాల్ టీమ్ బాపతు. అల్లది పాటల పోటీ

మెమెంటో - అడక్కు ! నారాయణకి అన్నీ ఫస్టు ప్రయిజులే. ఒకటో రెండో సెకండు. అంతే !" అని మావాడు పేరు పేరునా వర్ణించి చెప్పాడు.

నేను ఆశ్చర్యపడ్డాను; నా తలకి మించి, నారాయణని కౌగలించు కోవాలనిపించింది. కనీసం వాణ్ణి దగ్గరికి తీసుకుని వీపు నిమిరి "శభాష్ బేటా" అనాలనిపించింది.

కాని—వాడు అస్పృశ్యుడు !

"ఫస్టియర్‌లోనే, నారాయణ ఎంత డైనమిక్‌గా వుండగలడో రుజువై పోయింది. రామనాధశాస్త్రిగారు, నరసింహరాజుగారు, రామయ్య శెట్టిగారు, లోకేశ్వరరావుగారు, వెంకటరెడ్డిగారు లాంటి ప్రొఫెసర్లు ఏ వొక్కరు విడవకుండా నారాయణకి అన్ని అసోసియేన్లలోనూ టాప్‌పోస్టు లిచ్చి అతన్ని పైకి తీసుకు రావాలని కోరారు ?" అని కూడా వివరించేడు మావాడు.

మూడో యాడాది చివర ఎనాటమీలో తప్పాడు నారాయణ. వాడికి స్కాలర్‌షిప్ పోయింది. మళ్ళీ ఆర్నెల్లో పోయింది ఎనాటమీ పరీక్ష. హాస్టల్లో ఉచిత వసతి. భోజన సదుపాయాలు పోయాయి.

అంతే. వెంకడు నా దగ్గరకొచ్చి మొరపెట్టుకుని పదిహేను వందలు అడిగాడు. గుమస్తాగారికి చెప్పాను ఇవ్వమని. వెంకడికి పూర్ణార్జితమైన పొలం వుంది.

మూడేళ్ళు ఎనాటమీలో మకాంవేసి ఇంక చాల్లేక చదువు మాను కొన్నాడు నారాయణ. ఎవరో క్రిష్టియన్ డాక్టరు అతన్ని కాంపౌండ రుగా తన క్లినిక్‌లో అట్టే పెట్టుకున్నాట్ట; మావాడు చెప్పాడు.

"ఎంత తెలివి గలవాడు, ఎంత దుర్గతి !" అన్నాను.

"తెలివి వాడొక్కడి సొత్తేనా యేమిటి ?" అన్నాడు మా అబ్బాయి.

ఆ తరువాతి కథ చెప్పాలని నా కనిపించడం లేదు.

(9-9-78)